# మనసున్న మారాజు సీఎం జగన్



కనగానపల్లి పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



దాదులూరులో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు

• ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

**కనగానపల్లి:** ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో మనసున్న మహరాజులా పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన వైఎస్సార్ పింఛన్ కానుక పంపిణీ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని 12 గ్రామ సచివాలయాల పరిధిలో 8 గ్రామ సభలు నిర్వహించి, రూ.3 వేలకు పెంచిన 6,250 పాత పింఛన్లతో పాటు కొత్త మంజూరైన 350 పింఛన్ల డబ్బులను ఎమ్మెల్యే ఆధ్వర్యంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పంపిణీ చేశారు.

సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రాజకీయాలు, కులమతాలకతీతంగా అన్నివర్గాలకూ అర్హతే ప్రామాణికంగా పింఛన్లు మంజూరు చేస్తున్నారని ఎమ్మెల్యే తెలిపారు. గత ప్రభుత్వంలో మాదిరిగా ప్రభుత్వ కార్యాలయాలు, నాయకుల చుట్టూ తిరగకుండా గ్రామ వలంటీర్లు దరఖాస్తు చేయించి, అర్హులకు ప్రతి నెలా ఠంచనుగా 1వ తేదీ ఉదయాన డబ్బులు పంపిణీ చేయిస్తున్నారన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో 49 వేల మందికి సామాజిక పింఛన్లు అందుతున్నాయన్నారు.

**చంద్రబాబుది పేరు గొప్ప..ఊరు దిబ్బ:**

40 ఏళ్ల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబు.. తన పాలనంతా పేరు గొప్ప.. ఊరు దిబ్బ రీతిలో ఉందని ఎమ్మెల్యే విమర్శించారు. ఆయన హయాంలో 600 అబద్ధపు హామీలు ఇచ్చి, ఏ ఒక్కటీ నెరవేర్చలేదని, కొత్తగా రూ.3 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని అప్పు ఊబిలోకి నెట్టారన్నారు. ఇప్పుడు మళ్లీ అధికారంలోకి రావటానికి 'బాబు షూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీ' అంటూ టీడీపీ నాయకులు ఇంటింటా తిరుగుతున్నారన్నారు. రాజకీయ పాత్తుల కోసం చంద్రబాబు పాకులాడుతున్నారన్నారు. అయితే, వాటిని నమ్మి ప్రజలు మోసపోరన్నారు. సీఎం జగన్ తన పాదయాత్రలో చెప్పిన నవరత్న పథకాల్లో వంద శాతం అమలు చేసి, పేదల ఖాతాల్లో రూ.2.45 లక్షల కోట్లు నేరుగా జమ చేశారన్నారు. మరో రూ.2.5 లక్షల కోట్లు ఇంటి స్థలాలు, విద్యా కానుక, జగనన్న గోరుముద్ద వంటి పథకాలకు ఖర్చు చేశారన్నారు.

**పరిటాల కుటుంబం ప్రజలకు చేసింది శూన్యం:**

రాప్తాడు ప్రాంతంలో 25 ఏళ్ల పాటు రాజకీయ పదవుల్లో ఉన్న పరిటాల కుటుంబం పేద ప్రజలకు చేసింది శూన్యమని ఎమ్మెల్యే తెలిపారు. కానీ ప్రస్తుతం తాను చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక పరిటాల సునీత లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఆత్మకూరు, అనంతపురం రూరల్ మండలాలకు తాగునీటి సమస్యను తీర్చేందుకు పీఏబీఆర్ నీటి తరలింపునకు పైపులైన్లు ఏర్పాటు చేస్తుంటే, దాన్ని చూసి ఓర్వలేక పోతున్నారన్నారు. దొంగతనాలు, ఫ్యాక్షన్ చరిత్ర పరిటాల కుటుంబ సభ్యులదైతే..తనకు గ్రామాల్లో ప్రశాంతత, పేదల సంక్షేమమే ముఖ్యమన్నారు. తాను ఎమ్మెల్యే అయిన తర్వాతా పేరూరు డ్యాంకు కృష్ణా జలాలు తీసుకురావడంతోపాటు నియోజకవర్గంలోని అన్ని చెరువులు నింపి, అదనంగా 50 వేల ఎకరాలు సాగులోకి తెచ్చామన్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా రాప్తాడు నియోజకవర్గంలో రూ.2,800 కోట్లు ఖర్చు చేయటంతో పాటు 17 వేల మందికి ఇళ్లు, 2 వేల మంది రైతులకు ఉచితంగా బోర్లు వేయించామన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమాదేవి, ఎంపీడీఓ అలివేలమ్మ, ఎంపీపీ కుంపటి భాగ్యమ్మ, జెడ్పీటీసీ సభ్యుడు మారుతీ ప్రసాద్, ఏసీఓ రాజేశ్వరరెడ్డి, గొర్రెల పెంపకం సహకార సొసైటీ జిల్లా అధ్యక్షుడు నరసింహగౌడ్, మండల అగ్రిబోర్డు చైర్మన్ వెంకటరాముడు, డైరెక్టర్ ప్రభాకర్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు న్యాయం జరుగుతుంది

**కనగానపల్లి:** అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించి, వారికి అన్ని రకాలుగా న్యాయం చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రాప్తాడు ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తెలిపారు. సోమవారం మండల కేంద్రంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డిని మండల అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు కలిసి వారి డిమాండ్లపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయపరమైన డిమాండ్లన్నింటినీ పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అయితే కార్మిక సంఘాల నాయకులు వీటి గురించి ప్రభుత్వానికి నిశితంగా వివరించాలన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని వర్గాల ప్రజలకు మేలు జరిగేలా పాలన సాగిస్తున్నారని, అంగన్‌వాడీలు సమ్మెను విరమించి విధుల్లో చేరితే తప్పకుండా న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కదిరప్ప, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సభ్యులు చాముండి, అనిత, వరలక్ష్మి, అమ్ముజాక్షి, భార్గవి, అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేకు అయోధ్య అక్షింతల అందజేత



అక్షింతలను ఎమ్మెల్యే కేతిరెడ్డికి అందిస్తున్న వీహెచ్‌పీ సభ్యులు

**ధర్మవరం:** అయోధ్య శ్రీరామ పవిత్ర అక్షింతలను విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు పులిచెర్ల వేణుగోపాల్ సోమవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డికి అందించారు. ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముల ప్రాణప్రతిష్ట సమయంలో సాయంత్రం ఇంటి ముందు 5 దీపాలు వెలిగించాలని, ఇచ్చిన పవిత్ర అక్షింతలను రాముని ఆశీర్వాదంగా తలపై వేసుకోవాలని ఆయన సూచించారు. ప్రతి కుటుంబానికి శ్రీరాముని పవిత్ర అక్షింతలు, దేవాలయం నమూనా చిత్రపటం, ప్రాణ ప్రతిష్ట ఆహ్వాన పత్రం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ ధర్మవరం ఖండ కార్యవాహ అన్నం అరవింద్, పూజారి వెంకట్రాముడు, గట్టు చౌడప్ప, సోమశేఖర్, వెంకటరమణ, బీరే లోకేష్, పులిచెర్ల రాధాకృష్ణ, నీలూరి వరదరాజులు, వెంకటరాముడు, చింతా ఆంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

## పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారులకు కోడిగుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**తాడిమర్రి:** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ విజయలక్ష్మీ సూచించారు. మండలంలోని ఆత్మకూరు గ్రామంలో సోమవారం జరిగిన వికసిత్ భారత్ సంకల్పయాత్ర కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల కోసం కేంద్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు చేయించుకునే గర్భిణులకు నగదు అందిస్తోందన్నారు. కిసాన్ సమ్మాన్ నిధితో రైతులకు ఏడాదికి రూ.6 వేలు ఇస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డి, ఏఓ రమాదేవి, ఏపీఓ సాంబశివుడు, సంక్షేమ సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

**కోడిగుడ్ల పంపిణీ..**

మండలంలోని ఆత్మకూరు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో ఎంపీడీఓ విజయలక్ష్మీ గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ వెంకటనారాయణరెడ్డి, సచివాలయాల మండల కన్వీనర్ అల్లే సాయినాథ్‌రెడ్డిలతో కలసి ఆమె గర్భిణులు, బాలింతలకు కోడిగుడ్లు, పాల ప్యాకెట్లు పంపిణీ చేశారు.

## 'ఫ్యామిలీ డాక్టర్'తో మెరుగైన వైద్య సేవలు

•డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా సులేమాన్



మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ సెల్వియా

**తాడిమర్రి:** 'ఫ్యామిలీ డాక్టర్' విధానంతో ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నట్లు డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌ఓ సెల్వియా సులేమాన్ పేర్కొన్నారు. మండలంలోని కునుకుంట్ల గ్రామంలో సోమవారం వైద్యాధికారి గోవర్ధన్ నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. రికార్డులు, గర్భిణులు, బాలింతలకు వేసిన వ్యాధి నిరోధక టీకాల రిజిస్టర్లను పరిశీలించారు. వైద్య సేవలు పొందిన వృద్ధులు, గర్భిణులు, బాలింతలు ఆరోగ్యపరంగా తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ లక్ష్మీదేవి, ఏఎన్‌ఎం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## ఆస్పత్రులకే వెళ్లి.. సంతోషం పంచి



హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న మహేశ్వరరెడ్డికి పింఛన్ అందిస్తున్న వలంటీర్



పింఛన్ అందజేస్తున్న వలంటీర్ కాటమయ్య

**బత్తలపల్లి:** స్థానిక అంబేడ్కర్ కాలనీకి చెందిన మీనుగ కాశప్ప కుమార్తె జ్యోతి అనారోగ్యంతో బాధపడుతూ బెంగుళూరులోని సెయింట్ జోసెఫ్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. వలంటీర్ మాతంగి కాటమయ్య పెన్షన్ గడువు ముగుస్తుందని భావించి ఆదివారం రాత్రి బెంగుళూరు వెళ్లారు. పెన్షన్ నగదు రూ.3 వేలు అందించారు. దీంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. బెంగుళూరుకు వెళ్లి పింఛన్ నగదును అందజేసిన వలంటీర్ కాటమయ్యను సోమవారం జెడ్పీటీసీ కోటి సుధ, సర్పంచు ఆక్కిం కాశమ్మ, ఉప సర్పంచు కోటి గోపీనాథ్, సచివాలయ సిబ్బంది అభినందించారు.

**రామగిరి:** మండలంలోని పోలేపల్లికి చెందిన మహేశ్వరరెడ్డి హైదరాబాద్‌లో చికిత్స పొందుతుండగా, వలంటీర్ ఆదినారాయణరెడ్డి అక్కడికెళ్లి సోమవారం పింఛన్ అందించాడు. మహేశ్వరరెడ్డి కొన్ని నెలలుగా డయాలసిస్ చేయించుకుంటున్నాడు. వలంటీర్ హైదరాబాద్‌కు వచ్చి పింఛన్ అందజేయడం సంతోషంగా ఉందని పింఛన్‌దారు తెలిపాడు.

## చెస్‌లో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్



విద్యార్థిని సుమశ్రీని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

**ధర్మవరం అర్బన్:** చెస్ పోటీల్లో రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌ను తమ కళాశాల విద్యార్థిని సాధించినట్లు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సురేష్‌బాబు తెలిపారు. స్థానిక పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం విద్యార్థిని సుమశ్రీని ప్రిన్సిపాల్ సురేష్‌బాబు మెమెంటో అందించి అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అనంతపురంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 4,5,6 తేదీలలో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్ పోటీలలో 13 ఉమ్మడి జిల్లాల విద్యార్థులు పోటీపడగా చెస్ విభాగంలో ధర్మవరం విద్యార్థిని సుమశ్రీ స్టేట్ చాంపియన్‌షిప్ సాధించి సదరన్ రీజియన్‌కు అర్హత సాధించిందన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ పీడీ రాజేష్, అధ్యాపకులు పాల్గొన్నారు.

## పెరిగిన పింఛన్‌తో ఆర్థిక భరోసా



పింఛన్ లబ్ధిదారులతో ఎమ్మెల్యే సిద్దారెడ్డి

**ఎన్‌పీకుంట:** పెరిగిన పింఛన్లతో వృద్ధులు, వితంతువులకు ఆర్థిక భరోసా లభించిందని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పింఛన్ నగదును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ పాలనలో పింఛన్ల కోసం లబ్ధిదారులు కాళ్లరిగేలా ప్రదక్షిణ చేసినా మంజూరు చేసిన పాపాన పోలేదని, జగనన్న అధికారంలోకి వచ్చాక సూర్యోదయం కాకముందే అర్హులందరికీ ఇళ్ల ముంగిటే పింఛన్లు అందజేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కితే, ఇచ్చిన హామీలతో పాటు ఇవ్వని హామీలను సైతం నెరవేర్చి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల హృదయాలలో చెక్కుచెదరని స్థానం సంపాదించుకున్నారని అన్నారు. కాగా, మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఇన్‌చార్జ్ ఏపీఎం రమణప్ప తీరు సరిగా లేదని పలువురు నాయకులు, సిబ్బంది ఎమ్మెల్యేకు విన్నవించారు. అలాగే మండల పరిధిలోని జౌకల గ్రామంలో సద్దాం అనే వ్యక్తి ప్రభుత్వ తాగునీటి బోరును ఆక్రమించుకొని పునాది వేశాడని, ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాము, మండల కన్వీనర్ కొత్తరం గారెడ్డి, వైస్‌ఎంపీపీ కేశవరెడ్డి, స్థానిక సర్పంచ్ ఆంజినమ్మ, ఎంపీడీఓ ఆదినారాయణ, ఎంపీటీసీ సభ్యులు మగ్బూల్‌బీ, తిమ్మారెడ్డి, కోఆప్షన్ సభ్యుడు సుబహాన్, జేసీఎస్ కన్వీనర్ ఆదినారాయణరెడ్డి, వాటర్‌షెడ్ చైర్మన్లు బయారెడ్డి, ఓబుళరెడ్డి, యూత్‌కన్వీనర్ వేణుగోపాల్‌యాదవ్, బీసీసెల్ కన్వీనర్ ఆదెప్పనాయుడు, సచివాలయ కన్వీనర్ వెంకటేశ్వర్లు, ఉపసర్పంచులు రామక్రిష్ణ, సామిరెడ్డి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ జయరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలు



రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ శ్రీరాములు

**ధర్మవరం అర్బన్:** ధర్మవరం పట్టణంలోని ఎరగుంట పార్కు వద్ద సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్రగాయాలయ్యాయి. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన మేరకు... పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవపురానికి చెందిన శ్రీరాములు, అతని భార్య మంగమ్మలు ఇద్దరూ టూవీలర్‌లో పట్టణంలోకి వెళ్లారు. పని పూర్తి చేసుకుని తిరిగి ఇంటికి వస్తుండగా ఎరగుంట పార్కు వద్దకు రాగానే పట్టణంలోకి వస్తున్న ప్రసాద్ అనే యువకుడు టూవీలర్‌తో వీరిని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో శ్రీరాములు, భార్య మంగమ్మలతో పాటు ప్రమాదానికి కారణమైన మరో టూవీలర్ నడుపుతున్న ప్రసాద్‌కు కూడా తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వెంటనే ముగ్గురిని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా వైద్యులు ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## హత్యాయత్నం కేసులో ముగ్గురి అరెస్టు

**కదిరి టౌన్:** పట్టణంలోని మారుతీనగర్‌కు చెందిన మెకానిక్ శ్రీధర్‌పై ఆదివారం హత్యాయత్నం చేసిన ముగ్గురిని పోలీసులు అరెస్టు చేశా రు. శ్రీధర్ భార్య ఫిర్యాదు మేరకు బాలు, పవన్, ఇసాక్‌ను అరెస్టు చేసి జైలుకు పంపినట్లు సీఐ నారాయణ రెడ్డి సోమవారం తెలిపారు.

## క్లుప్తంగా

### సందడిగా ముగ్గుల పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

**కదిరి అర్బన్:** మున్సిపల్ పరిధిలోని బ్లూమూన్ పాఠశాలలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం నిర్వహించిన ముగ్గుల పోటీలు సందడిగా సాగాయి. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్లూమూన్ విద్యాసంస్థల కార్యదర్శి శ్రీదేవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

### చీకిరేవులపల్లిలో గ్రామసభ

**అమడగూరు:** మండలంలోని చీకిరేవులపల్లిలో సోమవారం రెవెన్యూ అధికారులు జాయింట్ భూముల పరిష్కారానికి రైతులతో సమావేశం నిర్వహించారు. రీ సర్వే పూర్తయిన తర్వాత పలువురు రైతులు భూములు జాయింట్‌గా ఉన్నందున సమావేశం నిర్వహించినట్లు తహసీల్దార్ వెంకటరెడ్డి పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకూ చిన్న సర్వే నంబర్లు లేకుండా సర్దుబాటు చేసుకుని పాస్‌పుస్తకాలు చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో వీఆర్‌ఓ మోదీన్, సర్వేయర్, రైతులు పాల్గొన్నారు.

### 31న 'మాదిగల యుద్ధభేరి'



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

**పుట్టపర్తి టౌన్:** విజయవాడలో ఈనెల 31న ఏపీ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో మాదిగల యుద్ధభేరి మహాసభ నిర్వహిస్తున్నట్లు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంటిమద్ది ఓబుళేసు తెలిపారు. సోమవారం పుట్టపర్తి పట్టణంలోని సాయి ఆరామంలో మహాసభ కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంగిశెట్టి, జిల్లా కార్యదర్శి రామాంజనేయులు, తదితరులున్నారు.

### నేడు డయల్ యువర్ డీఎం

**కదిరి అర్బన్:** ప్రయాణికుల సమస్యలు తెలుసుకునేందుకు మంగళవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డీఎం మైనొద్దీన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకూ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. 08494224315 నంబర్‌కు ఫోన్‌చేసి మాట్లాడవచ్చన్నారు.

### విద్యార్థులకు రగ్గుల పంపిణీ





విద్యార్థులతో సంస్థ ప్రతినిధులు

**పుట్టపర్తి అర్బన్:** పుట్టపర్తి మండలం పెడపల్లి ఉన్నత పాఠశాలలో హైదరాబాద్‌కు చెందిన బిగ్‌హెల్ప్ స్వచ్ఛంద సంస్థ దత్తతకు తీసుకున్న 15 మంది విద్యార్థినులకు ఉల్లన్ రగ్గులు పంపిణీ చేసింది. సోమవారం హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, బిగ్ హెల్ప్ ప్రతినిధి చెన్నక్రిష్ణారెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులకు వీటిని అందజేశారు. దీంతో విద్యార్థులు, తల్లిదండ్రులు బిగ్ హెల్ప్ సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు.

### ఆస్పత్రి తనిఖీ



గర్భిణులకు సూచనలిస్తున్న డీపీఎంఓ

**కదిరి అర్బన్:** కదిరి కుంట్లపల్లి వెల్‌నెస్ సెంటర్‌ను సోమవారం డిస్ట్రిక్ట్ ప్రోగ్రాం మేనేజ్‌మెంట్ ఆఫీసర్ (డీపీఎంఓ) కుళ్లాయప్ప తనిఖీ చేశారు. గర్భిణులు, బాలింతలు, కౌమార బాలికలకు నిర్వహిస్తున్న రక్తపరీక్షలను పరిశీలించారు. మందులు పంపిణీ చేశారు. అనంతరం పట్నం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రమీల పాల్గొన్నారు.

### 'పీసీఎంఆర్'లో సంక్రాంతి సంబరాలు

**ధర్మవరం:** నాగలూరి వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో సోమవారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. తెలుగుతనం ఉట్టిపడేటట్లు రైతు, పల్లె పడుచు, హరిదాసు, గంగిరెద్దు, బుడబుక్కలవారి వేషధారణలో విద్యార్థులు అలరించారు. పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్, డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

### భక్తిశ్రద్ధలతో ఉరుసు

**తలుపుల:** ఎగువపేటలోని హజరత్ షహమీర్ ఔలియా దర్గాలో ఉరుసు ఉత్సవం సోమవారం భక్తిశ్రద్ధలతో జరిగింది. పీఠాధిపతి హజ్రత్ సయ్యద్ షహమీర్ ఖాదరీ ఆధ్వర్యంలో గంధం ఉత్సవం నిర్వహించారు. పకీర్లు డప్పులు వాయిస్తూ ఊరేగింపుగా దర్గా వరకు తీసుకొచ్చారు. వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త మక్బూల్ అహమ్మద్, సీఈసీ సభ్యులు పూల శ్రీనివాసులురెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు.

### స్టడీ మెటీరియల్ పంపిణీ

**తలుపుల:** మండల కేంద్రంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రోటరీ క్లబ్ ఉపాధ్యక్షులు మహేశ్వర్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం స్టడీ మెటీరియల్ పంపిణీ చేశారు. (యూటీఎఫ్) ఉపాధ్యాయ సంఘం రూపొందించిన మాదిరి ప్రశ్నపత్రాలను 170 మందికి అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ సభ్యులు కిశోర్‌కుమార్‌రెడ్డి, ప్రభాకర్ యాదవ్, రాజశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### శ్మశాన వాటికకు స్థలం చూపండి

**తనకల్లు:** మండల పరిధిలోని గుర్రంబైలు, దేవళంతండా, బొంతలపల్లి, దీటీ పల్లి గ్రామాలలో దళితులకు శ్మశాన వాటికకు స్థలాన్ని చూపాలని ఎమ్మార్పీఎస్ నాయకులు కోరారు. సోమవారం తహసీల్దార్ శోభా సువర్ణమ్మకు వినతిపత్రం అందజేశారు.

### ఘనంగా అంధుల దినోత్సవం



విద్యార్థికి ట్యాబ్ అందజేస్తున్న ఎంఈఓలు

**తలుపుల:** మండల కేంద్రంలోని భవిత కేంద్రంలో సోమవారం అంధుల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు వెంకట్రాముడు, విజయ్‌కుమార్ మాట్లాడుతూ బ్రెయిలీ లిపిని లూయిస్ బ్రెయిలీ కనుగొన్నారన్నారు. అనంతరం కుర్లి పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న విద్యార్థికి ట్యాబ్‌ను, మిగతా విద్యార్థులకు వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయురాలు శాంతి, ఉపాధ్యాయుడు శంకర్‌రెడ్డి, రజియా పాల్గొన్నారు.

### క్యాలెండర్ల ఆవిష్కరణ

**పుట్టపర్తి:** జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు ప్రైవేట్ పాఠశాలల క్యాలెండర్లను సోమవారం డీఈఓ మీనాక్షి చేతుల మీదుగా ఆవిష్కరించారు. డీఈఓ కార్యాలయం వద్ద కార్యక్రమం నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల యజమానులు పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ కార్యకర్త మృతి

**నల్లచెరువు:** దేవిరెడ్డి పల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ కార్యకర్త చిలకల బోజప్ప (80) అనారోగ్యంతో ఆదివారం రాత్రి మృతి చెందాడు. ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి, వైఎస్సార్‌సీపీ సీఈసీ సభ్యుడు పూల శ్రీనివాసరెడ్డి సోమవారం గ్రామానికి విచ్చేసి బోజప్ప మృతదేహం వద్ద నివాళులర్పించారు. ఎంపీపీ రమణారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ దశరథ నాయుడు ఉన్నారు.

### నేడు ఎమ్మెల్యే పర్యటన

**ధర్మవరం రూరల్:** మల్లాకాలువ, ఓబుళనాయనపల్లి, చిన్నూరు బత్తలపల్లి, ధర్మపురి, ఆకుతోటపల్లి గ్రామాలలో మంగళవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి ప్రచారం చేపట్టనున్నట్లు ఆ పార్టీ నాయకులు గుర్రం శ్రీనివాసరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు, గృహసారథులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన కోరారు.

### పరామర్శ

**పుట్టపర్తి:** బుక్కపట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు పెనుజూరి కృష్ణమూర్తి భార్య శ్రీమతి (81) సోమవారం అనారోగ్యంతో మృతి చెందింది. ఎంపీపీ శ్రీధర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ గోవర్ధన్‌రెడ్డి మృతురాలి ఇంటి వద్దకు చేరుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. మృతురాలి భర్త కృష్ణమూర్తి, కొడుకు మహేష్‌ను ఓదార్చారు. పతంజలి ఈశ్వర్, డీలర్ నాగభూషణ ఉన్నారు.

### శంకరనారాయణకు సన్మానం

**పుట్టపర్తి:** గ్రీన్ భారత్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ శంకర్ నారాయణ సేవలు అమూల్యమైనవని పుట్టపర్తి డీఎస్పీ వాసుదేవన్ ప్రశంసించారు. ఇటీవల ఢిల్లీలోని సోక్రటీస్ సోషల్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ 2023 అవార్డు ప్రదానం చేశారు. సోమవారం సాయంత్రం స్థానిక సిద్ధార్థ కోచింగ్ సెంటర్‌లో ఎంఈఓ ప్రసాద్ అధ్యక్షతన శంకర్‌నారాయణకు సన్మాన సభ ఏర్పాటు చేశారు. మాజీ పుడా చైర్మన్ కోటా సత్యం, అల్ట్రా విజన్ ఐకేర్ ఆసుపత్రి చైర్మన్ బొగ్గు సురేష్, లాయర్ హరికృష్ణ, పల్లం రమేస్ బాబులు ఆయనను సన్మానించారు.